క్లుప్తంగా

వీర మరణం పొందిన జవాన్లకు నివాళులు



కృష్ణా: మండలంలోని కుసీ్న గ్రామంలో గల ఆంజనేయస్వామి ఆలయంలో వీర జవాన్లకు బీజేపీ నాయకులు ఆదివారం ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు నర్సప్ప మాట్లాడుతూ పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్లకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు భగవంతుడు మనోధైర్యం కల్పించాలని కోరుతూ గ్రామంలోని అన్ని పార్టీల నాయకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి ఆర్థిక సాయం అందజేత

మరికల్:మండలంలోని పెద్దచింతకుంట ఈశ్వర ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి ఆదివారం కాంగ్రెస్ నాయకులు సూర్యమోహన్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. నేటి నుంచి ప్రారంభమైన బ్రహ్మోత్సవాల సందర్భంగా పూజలు చేసి దేవాలయ అభివృద్ధి కోసం తనవంతుగా రూ.33 వేలను ఆలయ కమిటీ సభ్యులకు వితరణ చేశారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి ఆలయం అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు.

లక్ష్మీనరసింహస్వామికి పంచామృతాభిషేకం

మరికల్: మండలంలోని ఎక్లాస్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం నరసింహస్వామి జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి జల, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం అర్చకులు శివరామ్‌ప్రసాద్ ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ, అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నరసింహ, రాములమ్మ,సిద్ధమ్మ, ఆంజనేయులు,రామకృష్ణ, ఆశన్నలు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ఊట్కూరు: ఊట్కూరులోని ఎల్‌బీనగర్‌లో శ్రీశ్రీ పడమటి ఆంజనేయస్వామి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులచే హోమ కార్యక్రమం చేపట్టారు. సోమవారం సాయంత్రం రథోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు కృష్ణయ్యగౌడ్, శంకర్‌గౌడ్, వెంకటేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

చేపల కోసం చెరువు ఖాళీ



మాగనూర్: చేపలు పట్టేందుకు చెరువులోని నీటిని ఖాళీ చేసి వందలాది క్యూసెక్కుల నీటిని వృథాగా వదిలేస్తున్నారు. మాగనూర్ మండల పరిధిలోని తళంకేరి గ్రామ చెరువు నీటిని గత రెండు రోజులుగా మోటార్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. చెరువులో నీటిమట్టం ఎక్కువగా ఉన్నందున చేపలు పట్టేందుకు వీలు కాకపోవడంతో కొందరు వ్యక్తులు ఈ విధంగా నీటిని దిగువకు విడుదల చేశారు. నీరు వృథాగా పోతుండగా ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

క్రీడాకారులకు అభినందనలు



ధన్వాడ: జనగామ జిల్లా కేంద్రంలో ఈ నెల 15 నుంచి 18 వరకు జరగనున్న ఎనిమిదో రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్న ధన్వాడ క్రీడాకారులు శివకుమార్, సాయి మణికంఠ, రిత్విక్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, కార్తీక్, అనిల్, శివ, విష్ణువర్ధన్, అశ్విత్, శైలజ, శివానీలకు ఆదివారం ధన్వాడ యోగ క్లబ్ సభ్యులు అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో ఎంపిక కావాలని కోరారు. కార్యక్రమంలో బాలయ్య, మల్లేష్, శ్రీహరి, హనుమంతు, కోచ్ రామ్మోహన్ పాల్గొన్నారు.

పునరావాసం.. కలగా మారిన వైనం

- భయం గుప్పిట్లో హిందుపూర్ గ్రామం
- బిక్కు బిక్కుమంటూ బతుకుతున్న ప్రజలు



వరదలు వచ్చిన సమయంలో గ్రామంలోకి వచ్చిన వరద (ఫైల్)

కృష్ణా: ప్రతి ఏటా వర్షకాలంలో కృష్ణా నదికి వచ్చే వరదలతో హిందుపూర్ గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం లోతట్టులో ఉండడం మూలంగా వరద నీరు కాస్తా గ్రామంలోని ఇళ్లల్లోకి చేరుతుండడంతో వర్షాకాలం మొత్తం ప్రజలు నరక యాతన అనుభవించాల్సిన పరిస్థితి. ఇలా గత కొన్ని సంవత్సరాల నుంచి జరుగుతున్న తమకు న్యాయం జరగడంలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2021, 2022, 2023 జులై ఆగస్టులో కృష్ణా, భీమ నదులు ఒక్కసారిగా ఉప్పొంగడం వల్లా నది పరివాహాక ప్రాంత ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కాగా అప్పట్లో ప్రభుత్వం బాధితులను అన్ని రకాలుగా ఆదుకుంటామని హామీ కూడా ఇచ్చింది. కాని అందుకు అనుగుణంగా అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమైన హిందుపూర్ వరద బాధితులకు పునరవాసం కల్పించి న్యాయం చేయాలని కోరుతున్నారు. ప్రధానంగ హిందుపూర్ గ్రామానికి చెందిన దాదాపు 80 కుటుంబాలకు తీవ్ర నష్టం వాటిళ్లగా ప్రభుత్వం వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించుటకు అప్పట్లో ప్రతిపాదనలు పంపించింది. గ్రామం సమీపంలోని 88 సర్వే నెంబర్‌లో గల 3 ఎకరాల భూమిని పునరవాసం కల్పించడానికి కేటాయించాలని కలెక్టర్‌కు ప్రతిపాదన పంపినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. అయితే ఆ ప్రతిపాదనలు అమలుకు నోచుకోకపోవడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇవ్వాలి



గతంలో వరదలు వచ్చినప్పుడు స్వచ్ఛంద సంస్థలు 250 మంది బాధితులకు రూ.5వేల నగదు, రేషన్ సామగ్రితో పాటు ఇందిరమ్మ గృహాలను మంజూరు చేయించారు. అందులో కొంత మంది ఇళ్లు కట్టుకున్నారు. మిగతా వారికి రేషన్ కార్డులు లేకపోవడంతో స్థలాల మంజూరైన ఇళ్లు నిర్మించుకోలేదు. మళ్లీ అలాంటి భయానక స్థితి రాకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వమే బాధితులకు ఇళ్లు కట్టించి ఇస్తే వారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– అంజనేయులు, హిందుపూర్ గ్రామం

ఎలాంటి ప్రతిపాదనలు రాలేదు



హిందుపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని వరద బాధితులకు కేటాయించినట్లు తమ దృష్టికి రాలేదు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల ప్రతిపాదనల్లో కేవలం ఎస్సీ కాలనీవాళ్లకు రెండు మాత్రమే వచ్చాయి. మిగితా వారికి సంబంధించి ఎలాంటి ప్రతిపాదనలు రాలేదు.

– ఎంపీడీఓ జానయ్య, కృష్ణా మండలం

రైతు కష్టం.. రోడ్డు పాలు



నేల పాలైన ధాన్యం

మాగనూర్: రైతు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకుందామన్నా నానా అవస్థలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆదివారం మక్తల్ మండలం చిట్యాల గ్రామానికి చెందిన కొందరు రైతులు ట్రాక్టర్లలలో ధాన్యం లోడ్‌ను రాయచూర్‌కు తరలిస్తున్న క్రమంలో మాగనూర్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో సుమారుగా 10కి పైగా ధాన్యం బస్తాలు జారిపడి ధాన్యం మొత్తం రోడ్డు పాలైంది. రైతులు పండించిన పంటను ప్రభుత్వం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని నాయకులు ఇస్తున్న హామీలు క్షేత్రస్థాయిలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. మిల్లుల దగ్గరకు తీసుకెళ్లిన ధాన్యాన్ని అధికారులు త్వరగా కొనుగోలు చేయకపోవడంతో పలువురు రైతులు చేసేదేమి లేక తక్కువ ధర అయినా రాయచూర్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఇలా ప్రమాదానికి గురై ఆర్థికంగా చితికిపోతున్నారు.

ధాన్యం తరలింపునకు లారీలు పంపించండి

మరికల్: ధాన్యం తరలించే విషయంలో మిల్లర్లు అలస్యం చేయకుండా లారీలను పంపించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సూర్యమోహన్‌రెడ్డి కోరారు. మిల్లులకు ధాన్యం తీసుకురావడానికి గన్నీ బ్యాగులు, లారీలు లేక అవస్థలు పడుతున్న విషయాన్ని రైతులు ఆదివారం ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై స్పందించిన ఆయన రైతులకు నష్టం కలగకుండా మిల్లర్ల యజమానులు లారీలను అందుబాటులో ఉంచాలని సూచించారు. లేకపోతే అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయంపై సానుకులంగా స్పందించిన మిల్లర్ల నిర్వాహకులు.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

కిష్టంపల్లి చెరువు గండిని పూడ్చండి



గండిపడ్డ కిష్టంపల్లి చెరువు

మరికల్: మండల కేంద్రం పరిధిలోని కిష్టంపల్లి సున్నపురాళ్ల కుంటకు పడిన గండిని పూడ్చాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. కుంటకు గండి పడి 17 ఏళ్ల గడుస్తున్నా అధికారులు ఇంత వరకు గండికి మరమ్మతులు చేయలేదని తెలిపారు. మరమ్మతులు చేయకపోవడంతో వర్షాపునీరు వృథాగా పోవడంతో పాటు చెరువు కింద ఉన్న వ్యవసాయ బోర్లలో వేసవిలో భూగర్భజల్లాలు అడుగంటిపోయి పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎడాదైన అధికారులు స్పందించి చెరువుకు పడిన గండిని పూడ్చి వర్షపు నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కోస్గిరూరల్: నారాయణపేట్ జిల్లాలోని పిఎస్ సునంద మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం గుండుమాల్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో చేపట్టిన ఉచిత వైద్య శిబిరం విజయవంత మైందని ఆసుపత్రి డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఎముకలు ,కీళ్ల సంబంధిత సమస్యలతో బాధడుతున్నా రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ విజయ్‌కుమార్ , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు విక్రంరెడ్డి , మధుకర్‌రావు ,ప్రకాష్‌రెడ్డి , సురేష్‌రెడ్డి ఉన్నారు.

నారాయణపేట రూరల్: పట్టణంలోని నిత్యా హాస్పిటల్లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. శిబిరంలో 50 మందికి ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు యస్ శ్రీవాణి, జనరల్ ఫిజిషియన్ కార్తీక్ గందె, చిన్న పిల్లల వైద్య నిపుణురాలు సునిది గందె పర్యవేక్షణలో వైద్య చికిత్సలతో పాటు మందులు పంపిణీ చేశారు. అంతకు ముందు ఈ శిబిరాన్ని జిల్లా వైద్యా ఆరోగ్య శాఖాధికారి జయచంద్ర మోహన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వై.మల్లికార్జున్, కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గందె ఉమాకాంత్ ప్రారంభించారు.

పాత్రికేయుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



ఎమ్మెల్యేను కలిసిన ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పాత్రికేయ మిత్రుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ భవనం ఆధునీకరణ కోసం ఆర్‌అండ్‌బీ అధికారులతో ఎస్టిమేట్ చేయించాలని సూచించారు. మహబూబ్‌నగర్ ప్రెస్‌క్లబ్‌కు రాష్ట్రంలోనే మంచి పేరు తెచ్చే విధంగా కమిటీ పనిచేయాలని కోరారు. సమాజహితమైన వార్తలపైన దృష్టి సారించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నరేందర్‌చారి, నరేందర్‌గౌడ్, కోశాధికారి యాదయ్య, ఉపాధ్యక్షులు చింతకాయల వెంకటేష్, ధరణి, సంయుక్త కార్యదర్శులు సతీష్‌కుమార్, కృష్ణ, మణిప్రసాద్, ఈసీ సభ్యులు రవికుమార్, రాంకొండ, షాబుద్దీన్ ముల్లా, అహద్ సిద్దిఖీ, ఆయా దినపత్రికల పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి జయంతి ఉత్సవాలు



యజ్ఞం నిర్వహిస్తున్న పురోహితులు

నారాయణపేట రూరల్: పట్టణంలోని శ్రీరాఘవేంద్ర స్వామి ఆలయంలో నరసింహ జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి సుప్రభాతం, నిర్మాల్యం, పంచామృతాభిషేకం, తులసి అర్చన, అలంకరణ, భజన, పల్లకిసేవ, వసంత పూజ నిర్వహించారు. విశేషంగా నరసింహ జపహోమాన్ని శాస్త్రబద్ధంగా చేపట్టారు. జోషి రఘు ప్రేమాచార్యులు ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తూ నరసింహస్వామి మహిమలను కొనియాడారు.

పిల్లలకు ధార్మిక శిబిరం :

జయంతి ఉత్సవాల్లో భాగంగా 15 రోజుల పాటు చిన్నారులకు ఆధ్యాత్మిక అంశాలపై వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. భగవత్ నామాల ప్రాధాన్యత ఆధ్యాత్మిక అంశాలపై చిన్నారులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిబిరం ఐదు రోజులు రాఘవేంద్ర స్వామి ఆలయం, ఐదు రోజులు ఉత్తరాది మఠం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, మరో ఐదు రోజులు అనంతసేన స్వామి దేవాలయాల్లో నిర్వహిస్తున్నట్లు శ్రీపాద కులకర్ణి తెలిపారు.

నేడు కళ్యాణోత్సవం:

శ్రీ రాఘవేంద్ర స్వామి ఆలయంలో నరసింహ జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ రచకులు నరసింహాచారి, అనిల్ దేశాయి తెలిపారు. కళ్యాణోత్సవం అనంతరం మహారథోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతాయని, భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

సేవాకర్తలకు సత్కారం :

శ్రీ రాఘవేంద్ర స్వామి ఆలయానికి ఓబులాపూర్‌కు చెందిన రఘోత్తమరావు రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు సేవాసమితి తరపున జూషి రఘు ప్రేమ చార్య విద్వాన్ అనిల్ దేశాయిలు శాలువా మోమెంటోలతో ఘనంగా సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోస్గి రూరల్: మీర్జాపూర్ ఫీడర్‌లో ట్రీ బ్రాంచెస్ కటింగ్ ఉన్నందున మండల పరిధిలోని గ్రామాలలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ వెంకటేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

వాహనాల తనిఖీ

మరికల్: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ చౌరస్తా దగర ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆత్మకూర్, రాయిచూర్, మహబూబ్‌నగర్ నుంచి వచ్చే వాహనదారులను ఆపి డ్రైవింగ్ లైసన్స్, ఆర్సీ, తదితర పత్రాలను పరిశీలించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఏఎస్‌ఐ మసుద్ వాహనదారులను హెచ్చరించారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

కోస్గి రూరల్: ఆధ్యాత్మిక చింతనతోనే జీవితంలో మానసిక ప్రశాంతత లభిస్తుందని హిందూ ధర్మం ప్రవచనకర్త సాయి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వర శివ సాయి అయ్యప్ప దేవాలయ ప్రాంగణంలో శ్రీ షిర్డీ సాయి బాబా మందిరం 19వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకమత్యంగా ఉంటే దేనినైన సాధించవచ్చాన్నారు. భక్తులందరూ సచ్చరితను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో అరుణ్‌షిండే , మల్లికార్జున్ , చల్లా వెంకటేశం, మ్యాకల నర్సింములు, హన్మంతు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కలుసుకున్న పూర్వ విద్యార్థులు



ఉపాధ్యాయులతో విద్యార్థులు

దామరగిద్ద: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1999–2000 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. అనంతరం ఒకరి గురించి ఒకరు తెలుసుకొని సంతోషంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, నారాయణరావు, క్షీరలింగప్ప, రామలింగప్ప, వెంకట్రామరెడ్డి, శంభులింగం శివకుమార్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు

మరికల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 2008–09లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరి యోగక్షేమాలు తెలుసుకొని పాత జ్ఞాపకలను స్మరించుకున్నారు. అనంతరం విద్య నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సత్కారం

ధన్వాడ: మండల కేంద్రంలోని మత్స్య పారిశ్రామిక సహకర సంఘం కార్యలయంలో ఆదివారం అధ్యక్షుడు నర్సింహులు నాయుడు అధ్యక్షతన ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెపా నారాయణపేట జిల్లా ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్ పరీక్షల్లో మెరిట్ సాధించిన విద్యార్థులకు, వివిధ రంగాల్లోని ఉత్తమ ఉద్యోగులకు ముదిరాజ్ పెద్దలు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాఘవేందర్‌నాయుడు, గౌరవ అధ్యక్షులు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన పామాయిల్ తోట



కాలిపోయిన పామాయిల్ తోట

కొత్తపల్లి: పామాయిల్ తోట అగ్నికి ఆహుతైన ఘటన మండలంలోని భూనీడులో చోటు చేసుకుంది. భూనీడు గ్రామానికి చెందిన రైతు శేఖర్ గౌడ్ గ్రామ శివారులో నాలుగు ఎకరాల్లో పామాయిల్‌ను సాగు చేశారు. ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు తోట పరిసరాల్లో నిప్పు అంటించడంతో నాలుగు ఎ కరాల్లో సాగు చేసిన పామాయిల్ తోట కాలిపోయింది. అలాగే అదే రైతుకు చెందిన మామిడి తోటలో ఐదు చెట్లు పూర్తిగా కాలిపోయాయి. పక్క పొలం వారు సమాచారం ఇవ్వడంతో పలువురు రైతులు వచ్చి మంటలను ఆర్పి వేశారు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధిత రైతు వాపోయారు.

'డిగ్రీ కళాశాల' ఏర్పాటయ్యేనా..?

- కొత్తకోటలో విద్యార్థుల అవస్థలు
- ఎన్నికల హామీగానే సరిపెడుతున్న నాయకులు
- ఉన్నత విద్యకు దూరమవుతున్న విద్యార్థులు



కొత్తకోట పట్టణ ముఖ చిత్రం

కొత్తకోట రూరల్: మారుతున్న సమాజంలో ఉన్నత చదువులు ఎంత అవసరమో మనందరికీ తెలిసిందే. దేవరకద్ర నియోజవర్గంలోని కొత్తకోట, మదనాపురం, అడ్డాకుల, మూసాపేట మండలాల్లో ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థుల ఉన్నత చదువుల కల ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. కొత్తకోట మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేక ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. స్థానికంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని ప్రతి ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు హామీలు ఇవ్వడం తర్వాత మర్చిపోవడం ఇక్కడ పరిపాటిగా మారింది. ఆరు మండలాలకు కేంద్ర బిందువుగా ఉన్న కొత్తకోట అన్ని రంగాల్లో దినదినాభివృద్ధి చెందుతున్నప్పటికీ విద్యారంగంలో మాత్రం వెనకబడిపోయింది. గతంలో దేవరకద్ర నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆల వెంకటేశ్వర్‌రెడ్డి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ నియోజవర్గాన్ని పలు రంగాల్లో అభివృద్ధి చేసినా కొత్తకోటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మాత్రం ఏర్పాటు చేయలేకపోయారు. ప్రస్తుతం నియోజవర్గానికి కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా గెలిచిన జి.మధుసూదన్‌రెడ్డి అసెంబ్లీలో కొత్తకోటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు గురించి ప్రస్తావించారు. 2025–26 విద్యా సంవత్సరంలోనైనా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

చదువుకు మధ్యలోనే స్వస్తి..

దేవరకద్ర నియోజకవర్గంలోని కొత్తకోట, మదనాపురం, అడ్డాకుల, మూసాపేట మండలాల్లో ప్రతి ఏటా 1,500 మందికి పైగా ఇంటర్ ఉత్తీర్ణులవుతున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదవాలంటే వనపర్తి, మహబూబ్‌నగర్, గద్వాల వెళ్లాల్సి వస్తుంది. ఆయా పట్టణాలకు వెళ్లడం పేద, మధ్య తరగతి విద్యార్థులు భారంగా మారి చదువును మధ్యలోనే ఆపేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొత్తకోటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తుందని విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.


ఆర్థికంగా భారం



కొత్తకోటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో స్థానికంగా ఉన్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో చదువుతున్నాను.దీంతో ఆర్థికంగా భారంగా మారింది. ఖర్చులు భరించలేని చాలామంది ఉన్నత విద్యకు దూరం అవుతున్నారు.

కె.పల్లవి, డిగ్రీ విద్యార్థిని, అప్పరాల

కూలి పనులు చేస్తూ..



పదో తరగతి వరకు ప్రభుత్వ స్కూల్‌లోనే చదివాను. తల్లిదండ్రులు కూలీ పనులు చేస్తూ నన్ను చదివిస్తున్నారు. డిగ్రీ ప్రైవేట్‌లో చదవాలంటే ఖర్చులు ఎక్కువగా అవుతాయి. కొత్తకోటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉంటే మాలాంటి వాళ్లకు ఉపయోగంగా ఉంటుంది.

– సాయిచందన, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



కొత్తకోటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని ప్రతి ఎన్నికల్లో నేతలు హామీలు ఇచ్చిన అమలు చేయడంలో విఫలమయ్యారు. దీంతో ఉన్నత చదువులు విద్యార్థులకు భారంగా మారుతున్నాయి. ఈ ప్రాంతంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది.

– అజయ్‌కుమార్, ఏబీవీపీ, పూర్వ జిల్లా కన్వీనర్.